క్లుప్తంగా

సాహితీ ఆణిముత్యం రవీంద్రనాథ్ ఠాగూర్



లక్ష్మీపురం: భారతీయ సాహితీ తేజాన్ని విశ్వవ్యాప్తం చేసిన మహనీయుడు రవీంద్రనాథ్ ఠాగూర్ అని, మన దేశానికి తొలి నోబుల్ పురస్కారాన్ని అందించిన ఘనత ఆయనదేనని సీనియర్ గాయకుడు, విశ్రాంత అధికారి డి.వెంకటేశ్వరరావు అన్నారు. స్థానిక అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో ఠాగూర్ జయంతి బుధవారం నిర్వహించారు. తొలుత ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. సంస్థ కార్యదర్శి కొండాశివరామిరెడ్డి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రచయితగా, చిత్రకారునిగా, విద్యావేత్తగా గొప్ప మానవతా వాదిగా ఠాగూర్ చరిత్రలో నిలిపోయారన్నారు. సంస్థ కార్యదర్శి కొండాశివరామిరెడ్డి, సంగీత విద్వాంసుడు పి.మొగిలి మాట్లాడారు.

పేదలకు రెడ్‌క్రాస్ అన్నదానం

తెనాలి: స్థానిక రైల్వేస్టేషన్ సమీపంలోని శ్రీ శివలింగేశ్వర భక్తబృంద సేవాసమితి అన్నదాన కేంద్రం వద్ద బుధవారం పేదలకు అన్నదానం చేశారు. వరల్డ్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ సేవా కార్యక్రమం నిర్వహించారు. రెడ్‌క్రాస్ సొసైటీ తెనాలి సబ్ బ్రాంచ్ చైర్‌పర్సన్ ముమ్మనేని భానుమతి నేతృత్వంలో జరిగిన అన్నదానంలో హ్యాపీ హాస్పిటల్స్ అధినేత డాక్టర్ పావనీ ప్రియాంక ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు కుర్రా శ్రీను, కాళిదాసు వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. తెనాలిలో రెడ్‌క్రాస్ సేవలను అభినందించారు. రెడ్ క్రాస్ సభ్యులు, సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న వలంటీర్ల రాజీనామాలు



తెనాలి అర్బన్: తెనాలి పట్టణంలో వార్డు వలంటీర్ల రాజీనామాలు కొనసాగుతూ ఉన్నాయి. బుధవారం తెనాలి పట్టణంలోని 15 వార్డుకు చెందిన 15మంది తమ ఉద్యోగానికి రాజీనామా చేశారు. వాటిని సచివాలయ అడ్మిన్లకు అందజేశారు. రాజీనామాలను ఆమోదించినట్లు కమిషనర్ బండి శేషన్న తెలిపారు.

పాలిసెట్‌లో మెరిసిన తెనాలి తేజం

267వ ర్యాంకు సాధించిన తెనాలి విద్యార్థి



తెనాలి రూరల్: పాలిసెట్ ఫలితాల్లో తెనాలి విద్యార్థి ప్రతిభ చాటాడు. బుధవారం విడుదలైన ఫలితాల్లో పట్టణానికి చెందిన కొడవటిగంటి వెంకట అనంత కార్తికేయ 267వ ర్యాంకు సాధించాడు. కార్తికేయ పదో తరగతిలో 565 మార్కులు సాధించాడు. విద్యలో రాణిస్తున్న ఇతను గత నెల 27వ తేదీన జరిగిన పాలిసెట్ పరీక్షకు హాజరయ్యాడు. 267వ ర్యాంకుతో జిల్లాలోనే ప్రథమ స్థానంలో నిలిచినట్టు తెలుస్తోంది. కాగా వెంకట అనంత కార్తికేయ తండ్రి కమలేంద్రకుమార్ వ్యాపారం నిర్వహిస్తుంటారు. తల్లి గృహిణి.

పేదలకు అన్నదానం



తెనాలి రూరల్: పట్టణానికి చెందిన శ్రీ శివలింగేశ్వర భక్త బృంద సేవా సమితి ఆధ్వర్యంలో రైల్వేస్టేషన్ వద్ద బుధవారం పేదలకు అన్నదానం చేశారు. రజక సంఘ అధ్యక్షుడు, వైయస్సార్‌సీపీ నాయకుడు పెసర్లంక రమణ పుట్టిన రోజు సందర్భంగా ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో వైయస్సార్‌సీపీ నాయకులు, సేవా సమితి సభ్యులు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. వైయస్సార్‌సీపీ నాయకుడు తట్టుకూళ్ల అశోక్ యాదవ్, శానంపూడి రఘురామిరెడ్డి, కొమ్ము భిక్షాల్ రాయల్, జలగం రామకృష్ణ, కాళిదాసు వెంకటేశ్వరరావు, పినపాటి నిరంజన్, చిట్టిబాబు, శివరామ్, వంశీ తదితరులు పాల్గొని కేక్ కట్ చేశారు. పెసర్లంక రమణకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. పేదలు, వృద్ధులకు అన్నదానం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైయస్సార్‌సీపీలో రమణ సేవలను కొనియాడారు. కార్యక్రమంలో సిరిగిరి చెన్నారెడ్డి, సిరిగిరి శంకర్ రెడ్డి పాల్గొన్నారు.

ల్యాప్‌టాప్ చోరీ

గుంటూరు ఈస్ట్: ల్యాప్‌టాప్ చోరీకి గురైన ఘటనపై పట్టాభిపురం పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలు.. బ్రాడీపేట 4/10వ లైనులోని మానస హాస్టల్‌లో ఎం.కిరణ్‌కు సంబంధించిన ల్యాప్‌టాప్ బుధవారం చోరీకి గురైంది. బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్‌షోకు అపూర్వ స్వాగతం

- మండుటెండలోనూ స్థానికుల నుంచి విశేష ఆదరణ
- సంక్షేమ ప్రభుత్వాన్ని మరోసారి గెలిపించాలని కోరిన ఎమ్మెల్యే శివకుమార్



తెనాలి 29వ వార్డులో రోడ్‌షోలో ప్రజలకు అభివాదం చేస్తున్న ఎమ్మెల్యే శివకుమార్

తెనాలి: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తెనాలి అసెంబ్లీ అభ్యర్థి, సిటింగ్ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ బుధవారం పట్టణంలో నిర్వహించిన రోడ్‌షోకు విశేష ఆదరణ లభించింది. తీక్షణమైన ఎండ వేడిని ఖాతరు చేయకుండా పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, స్థానికులు రోడ్‌షోలో పాల్గొన్నారు. అన్ని వార్డుల్లోనూ ప్రజలు స్వచ్ఛందంగా బయటకు వచ్చి మద్దతు సంకేతాలను చూపారు. వైఎస్సార్‌సీపీ జెండాలతో ఫ్యాన్ గుర్తుకు ఓటేయాలని, సీఎం జగన్‌ను మరోసారి ముఖ్యమంత్రిగా గెలిపించాలని కోరుతూ ప్లకార్డులను ప్రదర్శిస్తూ రోడ్‌షోలో పాల్గొన్నారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు అందుతున్న తీరును ఎమ్మెల్యే శివకుమార్ వాకబు చేశారు. సంక్షేమ పథకాల కొనసాగింపునకు వైఎస్సార్‌సీపీకే విజయం చేకూర్చాలని అభ్యర్థించారు. అనంతరం 29, 30 వార్డుల పరిధిలోని సుల్తానాబాద్‌కు 'శివన్న విజయరథం' చేరుకుంది. వార్డు కౌన్సిలర్ రమావత్ కవితాబాయ్, శ్రీను నాయక్, స్థానిక నాయకులు బలుగూరి సురేష్, కోటా కిషోర్ బాబు, పోతురాజు, మునావత్ వెంకటేశ్వరరావు, బండారు సురేష్ తదితరులు శివకుమార్‌కు భారీ గజమాలతో ఘనస్వాగతం పలికారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలనలో అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అందుతున్నదీ లేనిదీ తెలుసుకున్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలోని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వస్తేనే సంక్షేమ పథకాలు కొనసాగుతాయని గుర్తుంచుకోవాలని చెప్పారు. ప్రజలు పొరపాటు చేస్తే సంక్షేమ పథకాలు ఆగిపోవడమే కాకుండా ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లీష్ మీడియం రద్దు చేస్తారని, ఆరోగ్యశ్రీ పథకాన్ని నీరుగారుస్తారని హెచ్చరించారు. బడుగు, బలహీనవర్గాలకు అండగా ఉంటున్న ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలని కోరారు. సుల్తానాబాద్‌లో గల శ్రీకాశీ విశ్వేశ్వరస్వామి ఆలయంలో ఎమ్మెల్యే శివకుమార్ ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం 30వ వార్డు పరిధిలోని అమరావతి కాలనీ, వడ్డెర కాలనీల్లో రోడ్‌షో కొనసాగించారు. వార్డు కౌన్సిలర్ కొమరాబత్తుని జయపాల్, ఎద్దు నాగరాజు, బండి ఆమోసు, ఇస్తం సత్యానందం, కనపర్తి రజని, ఎం.గోపి, ప్రవీణ్ స్థానిక నాయకులు శివకుమార్‌కు ఘనస్వాగతం పలికి గజమాలతో సత్కరించారు. ఆ వార్డు ప్రజలతోనూ ఎమ్మెల్యే శివకుమార్ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వాన్ని తిరిగి అధికారంలోకి తీసుకురావాల్సిన ఆవశ్యకతను గుర్తుచేశారు. అక్కడి చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అన్ని వార్డుల్లోని ప్రజలు చిరునవ్వులతో చేతులు ఊపుతూ శివకుమార్‌కు మద్దతు తెలిపారు. మున్సిపల్ కౌన్సిలర్లు పేరం సంజీవరెడ్డి, యాతాటి అనిల్, మట్లపూడి రాజేశ్వరరావు, పార్టీ నాయకులు రావి శ్రీనివాసరావు, బొమ్ము నాగిరెడ్డి, కొడాలి క్రాంతి, కోగంటి ఆషు, సయ్యద్ గౌస్, కసుకుర్తి నాగమల్లేశ్వరరావు పాల్గొన్నారు.



తెనాలి 29వ వార్డులో ఎమ్మెల్యే శివకుమార్ రోడ్‌షోలో పాల్గొన్న ప్రజలు



తెనాలి 29వ వార్డులో ఎమ్మెల్యే శివకుమార్‌కు భారీ గజమాలతో ఘనస్వాగతం

వైఎస్సార్‌సీపీకి అండగా ఉండాలి



కొలకలూరులో ప్రచారంలో అన్నాబత్తుని పుష్ప



కొత్తూరు లంక గ్రామంలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే శివకుమార్ పెద్ద కుమారుడు అన్నాబత్తుని సత్యనారాయణ

ఎమ్మెల్యే అభ్యర్థి అన్నాబత్తుని శివకుమార్ సతీమణి పుష్ప

తెనాలి రూరల్: రాష్ట్రంలోని అన్ని వర్గాలకు మేలు చేసే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి ప్రజలందరు అండగా ఉండాలని తెనాలి నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి అన్నాబత్తుని శివకుమార్ సతీమణి పుష్ప విజ్ఞప్తి చేశారు. మండల గ్రామం కొలకలూరులో బుధవారం సాయంత్రం ఆమె ఎన్నికల ప్రచారం నిర్వహించారు. నియోజక వర్గంలో ఎమ్మెల్యేగా అన్నాబత్తుని శివకుమార్ 27 వేల మందికి ఇళ్ల స్థలాలు ఇచ్చారని, అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలను అందించారని గుర్తు చేశారు. గతంలో ఎన్నడూ లేని విధంగా నియోజకవర్గంలో రూ. 1800 కోట్లతో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు చేపట్టారని, అన్ని వర్గాలు సంతోషంగా ఉన్నాయని తెలిపారు. రానున్న ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి ఎమ్మెల్యేగా అన్నాబత్తుని శివకుమార్, ఎంపీగా కిలారి వెంకట రోశయ్యలను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ప్రచారంలో కొలకలూరు గ్రామ పార్టీ అధ్యక్షుడు ప్రసాదం సురేష్, రావూరి జేవియర్, పినపాటి అనీల్‌కుమార్, మల్లవరపు బాబి, సుద్ధపల్లి వీరయ్య, పార్టీ అభిమానులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఇంటింటి ప్రచారంలో ముస్లిం నేతలు

ప్రచార పర్వం

తెనాలి: ముస్లిం మైనారిటీలకు ఎంతో అండగా నిలిచిన ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలోని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాన్ని మరోసారి అధికారంలోకి తీసుకురావాలని మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ సయ్యద్ ఖాలేదా నసీమ్ అభ్యర్థించారు. 'హర్ దిల్‌మే వైఎస్సార్' ఎన్నికల ప్రచారంలో భాగంగా బుధవారం పట్టణ 17, 18 వార్డుల్లోని ముస్లిం మైనారిటీల ఇంటింటి ప్రచారాన్ని నిర్వహించారు. ప్రతి ఇంటికి వెళ్లి ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి గుంటూరు ఎంపీ అభ్యర్థి కిలారి వెంకట రోశయ్య, తెనాలి ఎమ్మెల్యే అభ్యర్థి అన్నాబత్తుని శివకుమార్‌ను భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులుగా పోటీచేసిన పొన్నూరు, తెనాలి ఎమ్మెల్యేలు స్థానికులుగా నివసిస్త ప్రజలకు అందుబాటులో ఉంటారని గుర్తుచేశారు. కూటమికి అధికారమిస్తే ముస్లిం మైనారిటీలకు రిజర్వేషన్లు తొలగిస్తారని కూడా హెచ్చరించారు. ఈవీఎంలో అన్నాబత్తుని శివకుమార్ ఫ్యాన్ గుర్తు ఒకటో నెంబరులోనే ఉందని చెప్పారు. సంబంధిత కరపత్రాలను పంపిణీ చేశారు. ప్రచార కార్యక్రమంలో పార్టీ ముస్లిం మైనారిటీ విభాగం పట్టణ అధ్యక్షుడు జేబీ జిలాని, మైనారిటీ నాయకులు గోల్డ్ రహిమా, టోపీ సుభానీ, జిలానీ, షేక్ మీరావలి, రబ్బు, అసద్ ఆలీఖాన్, టెక్స్ బాల, బడే, అర్ఫానీ పాల్గొన్నారు.

23, 24వ వార్డుల్లో ఇంటింటి ప్రచారం

తెనాలి అర్బన్: ఎన్నికల ప్రచారంలో భాగంగా 23, 24వ వార్డుల్లో వైఎస్సార్‌సీపీ 24వ వార్డు కౌన్సిలర్ పెదలంక లక్ష్మీలావణ్య బుధవారం ఇంటింటి ప్రచారాన్ని నిర్వహించారు. ప్రతి ఇంటికీ వెళ్ళి కరపత్రాలను పంపిణీ చేసీ ఈవీఎంలపై ఓటు వేసే విధానాన్ని తెలియజేశారు. అందరూ ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థికి సంబంధించిన బ్యాలెటర్‌పేపరుపై రెండు ఓట్లు వేయాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు పెదలంక వెంకటేశ్వరరావు, పెద్ద సుభానీ, మేకల సురేష్, జంగం జానీ, సీమోను, తదితరులు పాల్గొన్నారు.

జగన్‌ను మరోసారి సీఎం చేసుకుందాం

కొత్తూరులంక (కొల్లిపర): జనరంజక పాలన అందించిన జగన్‌ను మరోసారి సీఎం చేసుకోవాడానికి ఫ్యాన్ గుర్తుకు రెండు ఓట్లు వేయాలని ఎమ్మెల్యే తెనాలి అభ్యర్థి అన్నాబత్తుని శివకుమార్ పెద్ద కుమారుడు అన్నాబత్తుని సత్యనారాయణ కోరారు. బుధంవారం మండల పరిధిలో కొత్తూరు లంక గ్రామంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక నాయకులతో కలసి ప్రతి ఇంటికి వెళ్లి వైఎస్సార్‌సీపీకి ఓటు వేసి రెండోసారి ముఖ్యమంత్రిగా జగనన్నను, తన తండ్రి అన్నాబత్తుని శివకుమార్‌ను తెనాలి ఎమ్మెల్యే గా, గుంటూరు పార్లమెంట్ అభ్యర్థి కిలారి వెంకట రోశయ్య కు అత్యధిక ఓట్లు వేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు.



ఇంటింటి ప్రచారంలో ఖలేదా నసీమ్, మైనారిటీ నేతలు



వైఎస్సార్‌సీపీని గెలిపించాలని కోరుతున్న కౌన్సిలర్ లావణ్య

హోంమంత్రి తానేటి వనితపై దాడి అప్రజాస్వామికం



సమావేశంలో మాట్లాడుతున్న పుసులూరి జీవా

నెహ్రూనగర్: హోంమంత్రి తానేటి వనితపై దాడి అప్రజాస్వామికమని మాదిగ లాయర్స్ అసోసియేషన్ రాష్ట్ర పుసులూరి జీవా పేర్కొన్నారు. బుధవారం నగరంపాలెంలో విలేకరులతో మాట్లాడారు. ఎన్‌డీఏ కూటమికి, చంద్రబాబుకు మాదిగలంటే ఎంత ప్రేమో అర్థమౌతుందన్నారు. కూటమి నేతలు పలు రకాలుగా మాదిగలను ఇబ్బందులకు గురిచేస్తుంటే మందకృష్ణ మాదిగ దీనికి ఏ సమాధానం చెప్తారని ప్రశ్నించారు. అసలు మందకృష్ణకు మాదిగలు రాజకీయ బానిసలుగా ఉండాలని, ఏ మాదిగ అయిన ఎమ్మార్పీస్ నుంచి అసెంబ్లీకి పంపే ప్రయత్నం చేశావా అని ప్రశ్నించారు. నీకు ఎటువంటి స్వార్థం లేకపోతే ఎమ్మార్పిస్ తరుపున ఎమ్మెల్యే సీట్లు కేటాయించాలని అడిగివాడేవని.. కాని నీ స్వలాభం కోసం ఎమ్మార్పీస్‌ను ఎన్‌డీఏ కూటమికి తాకట్టు పెట్టావని మండిపడ్డారు. కూటమి ఆధ్వర్యంలో తెలుగుదేశం అధికారంలోకి రాకముందే రాష్ట్ర హోంమంత్రిపైనే దాడి జరిగితే.. ఇక అధికారం వస్తే సామాన్య మానవుడి పరిస్థితి ఏ విధంగా ఉంటుందో అర్థం చేసుకోవచ్చాన్నారు. ఆయన వెంట అసోసియేషన్ నాయకులు రాయపాటి రత్నం పాల్గొన్నారు.

సాహితీ ఆణిముత్యం రవీంద్రనాథ్ ఠాగూర్

లక్ష్మీపురం: భారతీయ సాహితీ తేజాన్ని విశ్వవ్యాప్తం చేసిన మహనీయుడు రవీంద్రనాథ్ ఠాగూర్ అని, మన దేశానికి తొలి నోబుల్ పురస్కారాన్ని అందించిన ఘనత ఆయనదేనని సీనియర్ గాయకుడు, విశ్రాంత అధికారి డి.వెంకటేశ్వరరావు అన్నారు. స్థానిక అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో ఠాగూర్ జయంతి బుధవారం నిర్వహించారు. సంస్థ కార్యదర్శి కొండాశివరామిరెడ్డి అధ్యక్షత వహించారు. సంస్థ కార్యదర్శి కొండాశివరామిరెడ్డి, సంగీత విద్వాంసుడు పి.మొగిలి మాట్లాడారు.

మంత్రిపై దాడి అమానవీయ చర్య

నెహ్రూనగర్: హోంమంత్రి తానేటి వనితపై దాడి అమానవీయ చర్య అని స్వర్ణాంధ్ర ఎమ్మార్పీస్ వ్యవస్థాపక అధ్యక్షుడు ఏసుబాబు మాదిగ పేర్కొన్నారు. బుధవారం కాకాని రోడ్డులోని సంఘ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. తూర్పు గోదావరిలో నల్లజర్లలో పర్యటిస్తున్న ఆమెపై కొందరు దాడి చేయడం బాధాకరమన్నారు. ఒక దళిత మహిళపై ఈ విధంగా దాడి చేయడం సిగ్గుచేటన్నారు. దేశంలో అన్ని మారుతున్నాయి కాని దళితులపై దాడులు మాత్రం తగ్గడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.

పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన ఎస్పీ



సిబ్బందికి సూచనలిస్తున్న ఎస్పీ తుషార్ డూడీ

తెనాలి రూరల్: జిల్లా ఎస్పీ తుషార్ డూడీ బుధవారం సాయంత్రం తెనాలి వచ్చారు. మే 13వ తేదీ సోమవారం జరగనున్న సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి పట్టణంలోని పలు పోలింగ్ కేంద్రాలను ఎస్పీ సందర్శించారు. ముందుగా స్థానిక మారీసుపేటలోని ఎన్‌సీఆర్‌ఎం హైస్కూల్‌కు వచ్చిన ఎస్పీ, డీఎస్పీ ఎం. రమేష్, త్రీ టౌన్ సిఐ ఎస్. రమేష్‌బాబుతో కలిసి అక్కడ బూత్‌ల వద్ద పరిస్థితిని పరిశీలించారు. పట్టణంలో సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయాలని డీఎస్పీని ఆయన ఆదేశించారు. ఎక్కడ ఏ చిన్నపాటి ఘర్షణ, వివాదం కూడా జరగడానికి వీల్లేదన్నారు. అనుమానితులను ముందుగానే గుర్తించి బైండోవర్ చేయాలని ఎస్పీ ఆదేశించారు. అక్కడి నుండి చెంచుపేట కోగంటి శివయ్య మున్సిపల్ హైస్కూల్ పోలింగ్ కేంద్రానికి వెళ్లి పరిశీలించారు.

28వ వార్డులో టీడీపీకి షాక్



ఎమ్మెల్యే శివకుమార్‌తో మొవ్వా చందు, వారధి తదితరులు

తెనాలి: పట్టణ 28వ వార్డులో టీడీపీకి మంచి షాక్ తగిలింది. గత మున్సిపల్ ఎన్నికల్లో టీడీపీ కౌన్సిలర్ అభ్యర్థిగా పోటీచేసిన మొవ్వా చందు, తన మిత్రబృందంతో సహా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. తెనాలి అసెంబ్లీ అభ్యర్థి, సిటింగ్ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ మంగళవారం రాత్రి నిర్వహించిన ఎన్నికల ప్రచార రోడ్‌షోలో వీరు ఆయన సమక్షంలో పార్టీలో చేరారు. ఎమ్మెల్యే శివకుమార్ వీరికి పార్టీ కండువాలను కప్పి స్వాగతం పలికారు. బడుగు, బలహీనవర్గాల ప్రజలకోసం ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అమలుచేస్తున్న సంక్షేమ పథకాలు, వాటిని నియోజకవర్గంలోని ప్రజలకు అందజేసిన ఎమ్మెల్యే శివకుమార్ చేస్తున్న కృషికి మద్దతుగా నిలవాలన్న భావనతో పార్టీలో చేరినట్టు మొవ్వా చందు తెలిపారు. సార్వత్రిక ఎన్నికల్లో పార్టీ గెలుపునకు శక్తివంచన లేకుండా కృషిచేస్తామని ఆయన మిత్రులు స్పష్టం చెప్పారు. పార్టీలో చేరిన వారిలో మొవ్వా చందుతోపాటు కల్లు వారధి, మొవ్వా చిన్నబాబు, బేరి నాని, బేరి షారోన్, సయ్యద్ గౌస్, జోసఫ్ ఉన్నారు. కౌన్సిలర్ యాతాటి అనిల్ పాల్గొన్నారు.

మురికివాడల్లో ఓటుహక్కుపై అవగాహన



యడ్ల లింగయ్య కాలనీలో కరపత్రాల పంపిణీ

తెనాలి: దళిత బహుజన రిసోర్స్ సెంటర్ ఆధ్వర్యంలో బుధవారం ఓటరు చైతన్య ప్రచారోద్యమాన్ని తెనాలిలోని పలు మురికివాడల్లో నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన తెనాలి సిటీ కో–ఆర్డినేటర్ బి.రాజశేఖర్, ఆయా ప్రదేశాల్లో నివసించేవారికి ఓటు హక్కు వినియోగంపై అవగాహన కల్పించారు. భారతదేశం ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశమని, ఇందుకు డాక్టర్ బి.ఆర్ అంబేడ్కర్ రాజ్యాంగమే కారణమని చెప్పారు. ప్రజాస్వామ్య వ్యవస్థకు పునాది ఎన్నికలని గుర్తుచేశారు. విభిన్న భాషలు, మతాలు, కులాలు, సంస్కృతులతో కూడిన సమాజంలో 18 సంవత్సరాలు నిండిన ప్రతి పౌరునికి ఓటు హక్కు కల్పించి రాజకీయ సమానత్వ సాధనకు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ పునాది వేశారని చెప్పారు. ఓటు హక్కుతో రాష్ట్ర కేంద్ర ప్రభుత్వాలను ఎన్నుకోవడంలో ప్రజలందరిని ప్రత్యక్షంగా భాగస్వాములను చేశారని చెప్పారు. అంతటి కీలకమైన ఓటును ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని చెప్పారు. కో–ఆర్డినేటర్ బి రమేష్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ నచ్చిన వ్యక్తికి ఓటు వేయాలన్నారు. ఓటు వేసేటప్పుడు ఆధార్ కార్డు లేదా ఓటర్ కార్డు వెంట తీసుకువెళ్లాలని సూచించారు. ఓటు ఆవశ్యకతతో కూడిన కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ.బుజ్జిబాబు , తెనాలి దేవదాసు, సంఘ పెద్దలు పాల్గొన్నారు.

ఐటీఐలో 10లోగా పేర్లు నమోదు చేసుకోవాలి

తెనాలి రూరల్: ప్రభుత్వ/ప్రైవేటు పారిశ్రామిక శిక్షణసంస్థ (ఐటీఐల్లో) ఆగస్ట్ 2024 విద్యా సంవత్సరంలో చేరేందుకు దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు ఈ నెల 10వ తేదీ సాయంత్రంలోగా తమ పేర్లను నమోదు చేయించుకోవాలని తెనాలి ఐటీఐ ప్రిన్సిపల్, జిల్లా కన్వీనర్ రావి చినవెంకటేశ్వర్లు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆన్‌లైన్‌లో లేదా తెనాలి జగ్గడిగుంటపాలెంలోని ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణసంస్థ, గుంటూరు ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణసంస్థలలో ఏర్పాటు చేసిన నమోదు కేంద్రాల్లో ఒరిజినల్ సర్టిఫికెట్లతో అభ్యర్థులు పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. పేర్లు నమోదు చేసుకుని, సర్టిఫికెట్‌లు వెరిఫికేషన్ పూర్తి చేయించుక్ను అభ్యర్థులే జూన్ నెలలో జరిగే కౌన్సెలింగ్‌కు అర్హులన్నారు. వివరాలకు 9347795839, 6304572793 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

సత్యానికి ధర్మానికి నిదర్శనమే శ్రీరామచంద్రుడు



ప్రసంగిస్తున్న కోటేశ్వరరావు

నగరంపాలెం: స్థానిక బృందావన్‌గార్డెన్స్ శ్రీ వేంకటేశ్వరస్వామి దేవాలయం అన్నమయ్య కళావేదికపై మూడు రోజులపాటు నిర్వహించిన 'సంక్షిప్త రామాయణం' ధారావాహిక ప్రవచనం బుధవారంతో ముగిసింది. ప్రముఖ ఆధ్యాత్మిక ప్రవచకులు కేవీ కోటేశ్వరరావు ప్రసంగిస్తూ నారదుల వారు వాల్మీకి మహామునికి వంద శ్లోకాలతో అందించినదే సంక్షిప్త రామాయణం అన్నారు. మానవుడు నిత్యం వేదాధ్యానం చేయాలన్నారు. తద్వారా పొందిన జ్ఞానాన్ని ముందు తరాలకు అందించాలని పేర్కొన్నారు. మానవుడు శ్రీరాముని ఆదర్శంగా తీసుకుని సత్యం, ధర్మం, తల్లిదండ్రుల సేవలను విధిగా పాటించాలని చెప్పారు. సత్యం, ధర్మం ఆచరించడం వల్ల ధనం, సుఖం, జ్ఞానం కలిగి మానవుడు ఆనందంగా జీవిస్తారని పేర్కొన్నారు. శ్రీరాముడు అరణ్య వాసంలో అనేక విషయాలకు ఆదర్శంగా ఉన్నారని చెప్పారు. తొలుత కార్యక్రమాన్ని ఆలయ పాలక మండలి సహాయ కార్యదర్శి ఊటుకూరి నాగేశ్వరరావు, సుందర సత్సంగ్ సభ్యులు జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభించారు. కార్యక్రమంలో మన్నవ రవి ప్రసాద్, పి.శివారెడ్డి, సాంబశివరావు, మురికిపూడి లక్ష్మీసత్యనారాయణ పాల్గొనగా, కేవీ కోటేశ్వరరావుని దేవాలయ పాలకవర్గం సత్కరించారు.

నాగ మల్లేశ్వరరావు చిరస్మరణీయుడు



నాగమల్లేశ్వరరావు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న యూటీఎఫ్ నాయకులు

గుంటూరు ఎడ్యుకేషన్: ఉపాధ్యాయుడిగా అభ్యుదయ భావాలను కలిగిన నాగ మల్లేశ్వరరావు లోటు తీరనిదని యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బి.ఆదిలక్ష్మి, ఎం.కళాధర్ పేర్కొన్నారు. యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడిగా, రాష్ట్ర కార్యదర్శిగా పని చేసి కోవిడ్‌తో మృతి చెందిన కె.నాగ మల్లేశ్వరరావు తృతీయ వర్ధంతిని బుధవారం బ్రాడీపేటలోని సంఘ జిల్లా కార్యాలయంలో నిర్వహించారు. తొలుత ఆయన చిత్రపటం వద్ద పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే అభ్యుదయ భావాలను పుణికిపుచ్చుకున్న మల్లేశ్వరరావు ఉపాధ్యాయ ఉద్యమంలోనూ నిబద్ధతతో పని చేశారని కొనియాడారు. స్థానిక, జాతీయ, అంతర్జాతీయ ఆర్థిక, రాజకీయ విధానాలను అధ్యయనం చేసి, తోటి వారిని చైతన్యవంతులుగా తీర్చిదిద్దారని తెలిపారు. యూటీఎఫ్ రాష్ట్ర ప్రచురణల కమిటీ చైర్మన్ ఎం.హనుమంతరావు మాట్లాడుతూ నాగ మల్లేశ్వరరావును ఆదర్శంగా తీసుకుని పని చేయడమే అసలైన నివాళి అని అన్నారు. కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు జి.వెంకటేశ్వర్లు, సీహెచ్ ఆదినారాయణ, జి.వెంకటేశ్వరరావు, ఎం.గోవిందయ్య, కె.ప్రేమ్‌కుమార్, ఎండీ షకీలాబేగం, శివరామిరెడ్డి, ఆదంసాహెబ్, ధనలక్ష్మి, బాజీబాబా, గోపయ్య, శ్రీనివాస్, కార్తీక్, రమణ పాల్గొన్నారు.